అప్రోచ్ రహదారితో అవస్థలు

- గుండి ప్రధాన రోడ్డులో అడుగడుగునా గుంతలు
- రోడ్డుపై ట్రాన్స్‌ఫార్మర్‌తో పొంచి ఉన్న ప్రమాదం
- దుమ్ము, ధూళితో అనారోగ్య సమస్యలు


గుంతలమయంగా గుండి అప్రోచ్ రహదారి

ఆసిఫాబాద్‌అర్బన్: ఆసిఫాబాద్ జిల్లాగా ఆవిర్భవించినప్పటికీ ప్రజల ఇక్కట్లు మాత్రం తీరడం లేదు. జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా ఆసిఫాబాద్ పరిసర ప్రాంతాల నుంచి బైపాస్ రోడ్డు నిర్మించారు. మంచిర్యాల వైపు నుంచి వచ్చే వాహనాలు హైవే నుంచి జిల్లా కేంద్రంలోకి రావడానికి, జిల్లా కేంద్రంలోని వాహనాలు హైవేపైకి వెళ్లడానికి పాత రహదారిని వినియోగిస్తున్నారు. అయితే హైవేపై వెళ్తున్న వాహనాల వేగం ఎక్కువగా ఉండడం.. పలుమార్లు జిల్లా కేంద్రంలోకి వచ్చే రహదారిపై ప్రమాదాలు జరగడంతో అధికారులు జిల్లా కేంద్రం నుంచి హైవేపైకి వెళ్లే రహదారిని శాశ్వతంగా మూసివేశారు. గుండి రహదారి ద్వారా బైపాస్‌ని ఉపయోగించి హైవేపైకి వెళ్లడానికి వాహనాలకు అనుమతి ఇచ్చారు. ప్రస్తుతం ఇదే జిల్లా కేంద్రంలోని గుండి రహదారిపై నివాసం ఉంటున్న వారికి శాపంగా మారింది. అనుమతులు ఇచ్చిన అధికారులు స్థానిక ప్రధాన రహదారి నుంచి బైపాస్ వరకు అప్రోచ్ రోడ్డు నిర్మించలేదు. దీంతో భారీ వాహనాలు రహదారిపై వెళ్తుండడంతో దుమ్ము లేసి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇదే ప్రాంతంలో పాఠశాల, బ్యాంకులు, ఏజెన్సీలు, ఇతర వ్యాపార సముదాయాలు ఉండడంతో విద్యార్థులు, ప్రజలు ఎప్పుడు ఏం జరుగుతుందోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు మాత్రం అప్రోచ్ రోడ్డు నిర్మాణంపై దృష్టి సారించడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.

గుండి రహదారి గుంతలమయం..

జిల్లా కేంద్రం నుంచి బైపాస్ వరకు వెళ్లే రహదారి పూర్తిగా గుంతలమయంగా మారి వాహన చోదకులకు తలనొప్పిగా మారింది. ఇదే రహదారి పైనుంచి వాహనాలను మళ్లించి నాలుగు నెలలు గడుస్తున్నా కనీసం గుంతల రోడ్డుపై తట్టెడు మట్టి కూడా పోయలేదంటే పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

మలుపు వద్ద ట్రాన్స్‌ఫార్మర్‌తో ఇక్కట్లు..

గుండి రహదారి నుంచి వెళ్లే మూలమలుపు వద్ద విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఉండడంతో రోడ్డు ఇరుకుగా మారింది. ప్రధాన రహదారి నుంచి అటువైపు బస్సులు, లారీలు, భారీ వాహనాలు వెళ్లడం కష్టంగా మారిందని డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇబ్బంది పడుతున్నాం



బైపాస్ రహదారి నుంచి జిల్లా కేంద్రంలోని ప్రధాన రహదారిని కలిసే వరకు గుండి రహదారి సరిగ్గా లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. ఈ రహదారి నుంచి పెద్ద వాహనాలు రాకుండా చూడాలని గతంలో జిల్లా కలెక్టర్‌కు విన్నవించుకోగా ఆదేశాలు జారీ చేస్తామని హామీ ఇచ్చారు. కానీ నేటికీ నెరవేరలేదు. భారీ వాహనాలు ఈ రహదారిపై వెళ్లకుండా చూడాలి.

– సత్యమూర్తి, స్థానికుడు

అధికారులు చొరవ చూపాలి



అప్రోచ్ రోడ్డు నిర్మాణానికి సంబంధిత అధికారులు చొరవ చూపించాలి. సరైన రోడ్డు మార్గం లేకపోవడంతో వాహనదారులు ఎప్పుడు ఏం ప్రమాదం ముంచుకొస్తుందోనని ఆందోళన చెందుతున్నారు. గుంతల రోడ్డుపై నిత్యం స్కూల్ బస్సులు వెళ్తుండడంతో తల్లిదండ్రులు భయాందోళన చెందుతున్నారు.

– సత్యనారాయణ, స్థానికుడు

క్లుప్తంగా

ఉపాధిహామీ పనుల పరిశీలన


పనులు పరిశీలిస్తున్న ఎంపీడీవో అల్బర్ట్

పెంచికల్‌పేట్: మండలంలోని చేడ్వాయి గ్రామంలో చేపడుతున్న ఉపాధిహామీ పనులను బుధవారం ఎంపీడీవో అల్బర్ట్ పరిశీలించారు. పని ప్రదేశంలో కూలీలకు కల్పిస్తున్న సౌకర్యాలను, పనిదినాలను అడిగి తెలుసుకున్నారు. ఎండలు మండుతున్న నేపథ్యంలో కూలీలకు వడదెబ్బ తగలకుండా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. ప్రతీ కూలీకి పని దినాలను కల్పించేలా ముందస్తు ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. ఆయన వెంట ఎంపీవో గంగాసింగ్, పంచాయతీ కార్యదర్శి రాధ, ఉపాధిహామీ సిబ్బంది ఉన్నారు.

13 నుంచి ఏకాదశ దీక్షలు ప్రారంభం

ఆసిఫాబాద్‌అర్బన్: ఈనెల 23వ తేదీన హనుమాన్ జయంతి పురస్కరించుకొని 13వ తేదీ నుంచి జిల్లా కేంద్రంలోని కేస్లాపూర్ హనుమాన్ ఆలయంలో ఏకాదశ దీక్షలు ప్రారంభం కానున్నట్లు ఆలయ అర్చకులు శిరీష్‌శర్మ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హనుమాన్ మాలధారణ చేసుకునే భక్తులు ఉదయం 6 గంటలకు ఆలయానికి చేరుకోవాలని సూచించారు.

పారిశుధ్య పనుల నిర్వహణ


పారిశుధ్య పనులు చేపడుతున్న కార్మికులు

సాక్షి ఎఫెక్ట్..

లింగాపూర్: మండల కేంద్రంలో అస్తవ్యస్తంగా ఉన్న డ్రెయినేజీ వ్యవస్థపై 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి పంచాయతీ కార్యదర్శి రంజిత్ స్పందించారు. మండల కేంద్రంలో పంచాయతీ కార్మికులతో బుధవారం పారిశుధ్య పనులు చేయించారు. డ్రెయినేజీలో బ్లీచింగ్ పౌడర్‌ను చల్లారు.

బీఆర్‌ఎస్ గెలుపునకు కృషి చేయాలి


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ దండె విఠల్

కౌటాల: పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు గెలుపునకు ప్రతీ ఒక్క కార్యకర్త కృషి చేయాలని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండె విఠల్ అన్నారు. మంగళవారం రాత్రి మండల కేంద్రంలో కార్యకర్తలతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీల అమలులో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. బీఆర్‌ఎస్‌తోనే రైతులకు అన్ని సంక్షేమ పథకాలు అందాయని పేర్కొన్నారు. పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటామని, బీఆర్‌ఎస్‌తోనే అన్ని వర్గాల ప్రజలకు మేలు కలుగుతుందని తెలిపారు. నాయకులు నక్క శంకర్, ఉమా మహేశ్, శంకర్, దిలీప్, తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలు సద్వినియోగం చేసుకోవాలి

ఆదిలాబాద్‌రూరల్: గ్రామాల్లో నిర్వహిస్తున్న వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆరోగ్య పర్యవేక్షకులు బొమ్మెత సుభాష్ అన్నారు. బుధవారం మండలంలోని మారుమూల గిరిజన గ్రామమైన చిచ్‌ధరి ఖానాపూర్‌లో వైద్య శిబిరం నిర్వహించారు. పలువురికి వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. గర్భిణులకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది లక్ష్మీబాయి, కొడప యశోదా, శైలజ, ఆకాంక్ష పాల్గొన్నారు.

ఇసుక తవ్వకాలు నిలిపివేయాలి

బేల: మండలంలోని ఏజెన్సీ ప్రాంతంలోని కొబ్బాయి గ్రామ శివారులోని వాగులో అక్రమ ఇసుక తవ్వకాలను నిలిపివేయాలని బుధవారం మాజీ సర్పంచ్ గేడాం మనోజ్, గ్రామస్తులతో కలిసి తహసీల్దార్ సవాయిసింగ్‌కు ఫిర్యాదు చేశారు. ఆదివాసీల అనుమతి లేకుండా, పెసా చట్టానికి విరుద్ధంగా అక్రమ తవ్వకాలు చేసేందుకు ఎలా అనుమతులు ఇస్తారని ప్రశ్నించారు. పెద్దపెద్ద యంత్రాలతో తవ్వకాలను చేపట్టి, అక్రమంగా వాగు ఇసుకను మహారాష్ట్రలోని నేషనల్ హైవే పనులకు తరలించడం సరికాదన్నారు. తవ్వకాలు నిలిపివేయకపోతే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం మట్టి తవ్వకాలకు అనుమతులు ఇచ్చామని తహసీల్దార్ తెలిపారు.

మహంకాళి జాతర విజయవంతం చేయాలి


పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

రెబ్బెన: ఇందిరానగర్‌లోని కనకదుర్గాదేవీ, స్వయంభుగా వెలసిన మహంకాళి ఆలయంలో ఈనెల 23 నుంచి 25 వరకు నిర్వహించనున్న జాతర మహోత్సవాలను భక్తులు విజయవంతం చేయాలని ఆలయ ప్రధాన అర్చకుడు దేవార వినోద్, ఆలయ కమిటీ అధ్యక్షుడు మోడెం తిరుపతిగౌడ్‌లు కోరారు. బుధవారం ఆలయ ప్రాంగణంలో జాతర పోస్టర్‌ను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ 23న శివ పార్వతుల కల్యాణం, 24న అమ్మవారికి మొక్కులు, బోనాల సమర్పణ, సాయంత్రం 4 గంటలకు రథోత్సవం కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 25న భక్తులకు అమ్మవారి దర్శనం, ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరుపుతామన్నారు. గ్రామస్తులు గొట్ల సురేశ్, రవి, బాలకృష్ణ, మహేందర్, రాజు, లక్ష్మణ్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధిలో మహిళలే కీలకం


మాట్లాడుతున్న భరత్

కెరమెరి: పాఠశాలల అభివృద్ధి కోసం మహిళలు కీలకపాత్ర పోషించాల్సి ఉంటుందని సెక్టోరల్ అధికారి భరత్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల పాత్రపై నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. గతంలో ఎస్‌ఎంసీ కమిటీల స్థానంలో నూతనంగా వీవో సభ్యులతో ఏఏపీసీలను నియమించామన్నారు. డీపీఎం రామకృష్ణ, సారయ్య, ఎంఎస్‌వో ఆడే ప్రకాశ్, కాంప్లెక్స్ హెచ్‌ఎం చంద్రశేఖర్, ఏపీఎం జగదీశ్వర్ ఉన్నారు.

వాంకిడి: మండల కేంద్రంలోని జెడ్పీఎస్‌ఎస్ పాఠశాలలో బుధవారం హెచ్‌ఎంలు, స్వయం సహాయక సంఘాల అధ్యక్షులకు అమ్మ ఆదర్శ పాఠశాలల నిర్వహణపై అవగాహన సమావేశం నిర్వహించారు. రీసోర్స్ పర్సన్‌లు శిక్షణ ఇచ్చారు. తహసీల్దార్ రోహిత్, ఎంపీడీవో వి.వి వరలక్ష్మి, ఎంఈవో మనుకుమార్, రీసోర్స్ పర్సన్ చైతన్యకుమార్ తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకే ఫ్లాగ్‌మార్చ్

నార్నూర్: లోకసభ ఎన్నికల దృష్ట్యా శాంతిభద్రతల పరిరక్షణ కోసమే ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్నట్లు ఎస్సై రవికిరణ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని స్వాగతం కమాన్ నుంచి విజయ్‌నగర్ కాలనీ వరకు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శాంతియుత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించుకోవాలని సూచించారు. గ్రామాల్లో ప్రతిఒక్కరూ ఐక్యత సోదరభావంతో మెలగాలని సూచించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో కేంద్ర బలగాలు పాల్గొన్నాయి.

వెండి కిరీటానికి నగదు విరాళం


విరాళం అందజేస్తున్న సభ్యులు

ఆసిఫాబాద్‌అర్బన్: సిర్పూర్(టి) మండలం రుద్రాపూర్‌లో ఈనెల 21న అయ్యప్ప ఆలయం ప్రారంభోత్సవం పురస్కరించుకొని బుధవారం జిల్లా కేంద్రంలోని అయ్యప్పస్వామి ఆలయ కమిటీ సభ్యులు మూలవిరాట్‌కు వెండి కిరీటం తయారీకి రూ.1,01,111 మొత్తాన్ని విరాళంగా రుద్రాపూర్ ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఆసిఫాబాద్ అయ్యప్ప ఆలయ కమిటీ అధ్యక్షుడు వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శి వెంకట్‌గౌడ్, గురుస్వామి భాస్కరశర్మ, సభ్యులు వినాయక్, సంతోష్, శ్రీనివాస్, హరీశ్, రవీందర్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు ఆహ్వానం..

రుద్రాపూర్ అయ్యప్ప ఆలయ కమిటీ సభ్యులు స్థానిక ఎమ్మెల్యే కోవలక్ష్మిని మర్యాద పూర్వకంగా కలిసి ఆలయ ప్రారంభోత్సవ ఆహ్వాన పత్రిక అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. ఆలయ నిర్వాహణ కమిటీ సభ్యులు దాసు, భాస్కరశర్మ, కనకయ్య, తదితరులు పాల్గొన్నారు.

'కాంగ్రెస్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలి'


మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ

వాంకిడి: కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లి భారీ మెజార్టీతో గెలిపించేందుకు కార్యకర్తలు కృషి చేయాలని కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ కోరారు. బుధవారం మండల కేంద్రంలో పార్టీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన ఆరు గ్యారెంటీలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని, విస్తృతంగా ప్రచారం నిర్వహించి భారీ మెజార్టీ సాధించేలా కృషి చేయాలన్నారు. బీజేపీ, బీఆర్‌ఎస్ అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను వివరించాలని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కొక్కిరాల విశ్వప్రసాద్, మండల అధ్యక్షుడు నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

రెబ్బెన: ప్రజల పక్షాన ఉండి ప్రజా సమస్యల్లో భాగస్వామ్యం అవుతానని ఆదిలాబాద్ ఎంపీగా ఒక్క అవకాశం ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ పార్లమెంట్ అభ్యర్థి ఆత్రం సుగుణ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో పార్టీ కార్యకర్తల సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ పార్టీలోని ప్రతి ఒక్కరికి అన్ని వేళల్లో అందుబాటులో ఉంటూ అందరిని కలుపుకుపోతూ ముందుకు వెళతానన్నారు. సమావేశంలో డీసీసీ అధ్యక్షుడు విశ్వ ప్రసాద్‌రావు, మండల అధ్యక్షుడు రమేశ్, మాజీ జెడ్పీటీసీ సోమయ్య, నాయకులు సుదర్శన్‌గౌడ్, చిరంజీవిగౌడ్, రాజీవ్ తదితరులు పాల్గొన్నారు.

ఆసిఫాబాద్‌రూరల్: బూర్గుడ బీసీ కాలనీకి చెందిన 20 మందితో పాటు వార్డు సభ్యులు బుధవారం బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరారు. ఈసందర్భంగా ఎంపీ అభ్యర్థి సుగుణ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారంలో ఉన్న ప్రభుత్వంతోనే గ్రామాల్లో అభివృద్ధి సాధ్యమన్నారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ నాయకులు విశ్వప్రసాద్, బాలేశ్ గౌడ్, బాల కిషన్, ప్రకాశ్, బావూజీ, శోభ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా స్తంభాల తరలింపు



కౌటాల: మండలంలోని గురుడుపేట గ్రామ పంచాయతీ పరిధి యాపలగూడ గ్రామ సమీపంలో బుధవారం ట్రాక్టర్ సాయంతో విద్యుత్ స్తంభాలను ప్రమాదకరంగా రోడ్డుపై తరలించారు. యాపలగూడ గ్రామ సమీపంలో విద్యుత్ స్తంభాలు ఉండగా, సదరు గుత్తేదారు రోడ్డుపై నుంచే ఈడ్చుకుంటూ తీసుకెళ్లడంతో ప్రధాన రహదారి ధ్వంసమైంది. స్తంభాలను రోడ్డుపై నుంచి తీసుకెళ్తుండడంతో వాహనదారులకు సైతం ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న సదరు గుత్తేదారుపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

'ఉపాధి'పై అనాసక్తి!


కౌటాలలో ఉపాధిహామీ పనులు చేస్తున్న కూలీలు

- గ్రామాల్లో పనులకు హాజరుకాని కూలీలు
- కొత్త నిబంధనలతో ఇబ్బందులు
- లక్ష్యం చేరని అధికారులకు షోకాజ్ నోటీసులు
- జిల్లాలో 1,73,545 మంది కూలీలు

కౌటాల: గ్రామాల నుంచి వలసల నివారణకు తీసుకొచ్చిన ఉపాధిహామీ పథకంపై కూలీలు ఆసక్తి చూపడం లేదు. రెండేళ్ల క్రితం కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త నిబంధనలు, కూలీ డబ్బుల చెల్లింపులో జాప్యం కారణంగా కూలీలు ఉపాధి పనులు చేసేందుకు ముందుకు రావడం లేదు. ప్రతీ గ్రామంలో రోజూ 50 నుంచి 100 మంది కూలీలకు పని కల్పించాలని నిబంధనలు ఉన్నా, 40 మంది లోపే పనులకు హాజరవుతున్నారు. కాగా ఉపాధి కూలీని తాజాగా రూ. 272 నుంచి రూ. 300కు పెంచుతూ కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

జిల్లాలో 1,73,545 కూలీలు

జిల్లాలోని 15 మండలాల్లో 335 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఆయా గ్రామాల్లో మార్చి నాటికి 93,385 జాబ్‌కార్డు కలిగిన కుటుంబాలు ఉన్నాయి. మొత్తం 1,73, 545 మంది ఉపాధి కూలీలు ఉన్నారు. వీరికి 2023 –24 ఆర్థిక సంవత్సరంలో 39,92,603 పని దినాలు కల్పించాలని నిర్ణయించారు. ఇందులో గత మార్చి నెల వరకు 36,22,300 పని దినాలు పూర్తి చేశారు. జిల్లా వ్యాప్తంగా 90 శాతం పైగా లక్ష్యాన్ని పూర్తి చేశారు. 2024–25 ఆర్థిక సంవత్సరంలో 38,57,940 ఉపాధి పని దినాల లక్ష్యం నిర్ణయించారు.

కొత్త నిబంధనలు..

ఉపాధి హామీలో అవకతవకలను అరికట్టేందుకు సర్కారు ప్రత్యేక చర్యలు తీసుకుంది. పనులకు వచ్చిన వారి వివరాల నమోదుకు ప్రత్యేకంగా నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టం(ఎన్‌ఎంఎంఎస్) యాప్‌ను రూపొందించింది. పనులు ప్రారంభానికి ముందు వచ్చిన వారి ఫొటోను పని ప్రదేశంలోనే ఫోన్‌లో తీసి ఉదయం 11గంటల్లోపు అప్‌లోడ్ చేయాలి. ఈ విధానం కూలీలకు తీవ్రమైన నష్టం కలిగిస్తుంది. నెట్‌వర్క్ సరిగా లేకపోతే అటెండెన్స్ నమోదు కావడం లేదు. దీంతో కూలీలు పని చేసినా ఆ రోజు కోల్పోతున్నారు. ఒక్కొక్కరికి పనిదినాలు 50 రోజులు కూడా దాటడం లేదని కూలీలు చెబుతున్నారు. గతంలో వేసవి అలవెన్స్ కింద రోజు వేతనానికి అదనంగా ఫిబ్రవరిలో రూ. 20, మార్చిలో రూ. 25, ఏప్రిల్, మే నెలల్లో రూ. 30, జూన్‌లో రూ. 20 కలిపి చెల్లించేవారు. గడ్డపారలు, పారలకు మొనలు పెట్టించడానికి అయ్యే ఖర్చులు ప్రభుత్వమే చెల్లించేది. ప్రస్తుతం అలవెన్స్‌లు తొలగించారు. దీంతో ఉపాధి హామీ పనులకు వచ్చిన రూ.200 లోపే వస్తున్నాయని, బయట పనులకు వెళ్తే రూ.400 నుంచి రూ.500 వరకు వస్తున్నాయని కూలీలు పేర్కొంటున్నారు.

షోకాజ్ నోటీసులు జారీ

జిల్లాలో ఉపాధిహామీ పథకంలో కూలీల సంఖ్య పెంచడంలో విఫలమయ్యారని జిల్లాలోని 12 మండలాల్లోని ఎంపీడీవోలు, ఎంపీవోలు, ఈజీఎస్ ఏపీవోలకు జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారీ ఇటీవల షోకాజ్ నోటీసులు జారీ చేశారు. జిల్లాలో 15 మండలాలకు గాను.. కౌటాల, దహెగాం, తిర్యాణి మినహా మిగతా మండలాల అధికారులు నోటీసులు అందుకున్నట్లు సమాచారం. గత నెలలో వ్యవసాయ పనుల కారణంగా కూలీలు ఉపాధి పనుల వైపు కన్నెత్తి చూడలేదు. ఫలితంగానే కూలీల సంఖ్య గణనీయంగా తగ్గింది. ఉపాధి కూలీల సంఖ్య పెరిగే విధంగా ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని, ఈజీఎస్ సిబ్బందితో అధికారులు ప్రత్యేక సమావేశాలు నిర్వహించి ఆదేశాలు జారీ చేశారు. కానీ కొంత మంది అధికారుల పనితీరులో మార్పు రాలేదు. దీంతో నోటీసులు అందించినట్లు తెలుస్తోంది. అయితే ఉపాధిహామీ పథకంలో మండలాల్లో సిబ్బంది కొరత ఉందని, కొత్తగా ఫీల్డ్ అసిస్టెంట్లను నియమించడం లేదని, కొత్తగా ఏర్పాటు చేసిన గ్రామ పంచాయతీల్లో సైతం ఎఫ్‌ఏలు లేరని జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందించ లేదని మండల అధికారులు వాపోతున్నారు.

జోరుగా గోడం నగేశ్ ప్రచారం

నార్నూర్: బీజేపీ అభ్యర్థి గోడం నగేశ్ ఎన్నికల ప్రచారం జోరుగా సాగుతోంది. బుధవారం మండలంలోని జండా, తడిహత్నూర్, గాదిగూడ మండలంలోని పిప్రీ, సావరి, ఝరి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయనకు ప్రజలు అడుగడుగున నీరాజనం పలికారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎంపీగా ఒక అవకాశం ఇస్తే అభివృద్ధి చేసి, చూపిస్తానని అన్నారు. కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోదీ దేశ రక్షణకు ఎంతో కృషి చేస్తున్నారని, బీజేపీ అధికారంలో ఉంటేనే దేశం అభివృద్ధిలో దూసుకుపోతుందన్నారు. ఒకసారి అవకాశం ఇవ్వాలని ప్రజలను కోరారు. అనంతరం హిందూ ఉత్సవసమితి జిల్లా నాయకుడు జ్ఞానోబా పుస్కర్, మాజీ జెడ్పీటీసీ రూపావతి పుస్కర్‌లు ఆయనను కలిసి శాలువాతో సత్కరించారు.


రంజాన్‌కు మసీదులు ముస్తాబు


కెరమెరి: విద్యుద్దీపాలతో ముస్తాబైన మసీదు

కెరమెరి: నేడు నిర్వహించే రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని మండలంలోని మసీదులు ముస్తాబయ్యాయి. నెల రోజులు ఎంతగానో భక్తిశ్రద్ధలతో చేపట్టిన ఉపవాస దీక్షలు నేటితో ముగియనున్నాయి. మండల కేంద్రంతో పాటు ఉదానగర్, సుల్తాన్‌గూడ, సుర్దాపూర్, ధనోరాలో గల మసీదులకు రంగులు వేశారు. మండలంలోని సుల్తాన్‌గూడలోని ఈద్గ మైదానంలో నేడు ఉదయం అన్ని ప్రాంతాలకు చెందిన ముస్లింలు వచ్చి నమాజ్ చేయనున్నారు.

కాగజ్‌నగర్‌రూరల్: ఈద్ ఉల్ ఫితర్ పండుగ సందర్భంగా కాగజ్‌నగర్ పట్టణం, మండలంలోని ఈద్గాలు ముస్తాబయ్యాయి. పవిత్ర రంజాన్ మాసం బుధవారం సాయంత్రం ముగియడంతో గురువారం ఈదుల్ ఫితర్ పండుగ జరుపుకోనున్నారు. ఈ సందర్భంగా పట్టణంలోని కదీం ఈద్గా, మండలంలోని చింతగూడ ఈద్గాలను కమిటీల ఆధ్వర్యంలో ముస్తాబు చేశారు.

చెట్ల కొమ్మలు తొలగింపు


తొలగించిన చెట్ల కొమ్మలు

కౌటాల: మండల కేంద్రంలోని విజయనగరం రోడ్డు సమీపంలో విద్యుత్ తీగల కింద ఉన్న చెట్ల కొమ్మలను బుధవారం విద్యుత్ శాఖ అధికారులు తొలగించారు. ఒకవైపు పచ్చదనం పేరిట కోట్ల రూపాయలు నిధులు వెచ్చించి మొక్కలు నాటుతుండగా, విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్నాయని చెట్ల కొమ్మలను నరికి వేస్తున్నారు. ఎలాంటి అనుమతులు లేకున్నా విద్యుత్ సిబ్బంది ఏటా చెట్లను నరికివేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. విద్యుత్ తీగల కింద మొక్కలు నాటడం ఎందుకు.. నాటిన మొక్కలు చెట్లుగా ఎదిగిన తర్వాత నరకడం ఎందుకని మండలవాసులు ప్రశ్నిస్తున్నారు.